


# సంసారంలో సరిగమలు - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## సౌశీల్యం

**తలుపు తీసి** లోపలకి వచ్చిన విభు బెడ్‌రూంలోంచి వినిపిస్తున్న మాటలకి ఆగిపోయాడు. మేనేజర్ ఆఫీస్ కి రాకపోవడంతో విభు ముందే బయలుదేరి ఇంటికి వచ్చేసాడు. వీలైతే సాగరితో సినిమాకి వెళ్దాం అన్నది అతని ప్లాన్. సినిమాలు, షికార్లులాంటి ముచ్చట్లు తీర్చలేదని మూతి ముడుచుకునే అమ్మాయికాదు సాగరి. 'మీకు కుదిరినప్పుడే వెళ్దాం' అంటుంది. అందుకే విభుకి భార్యంటే అమిత ప్రేమ.

"నువ్వు ఎట్టి పరిస్థితిలో ఈ పెళ్ళి చేసుకోకు గౌ. నువ్వు ప్రేమించిన అబ్బాయితో లేచిపో" సాగరి ఫోన్‌లో తన మేనత్త కూతురికి సలహా ఇస్తోంది.

విభు అదిరిపడ్డాడు. 'బాబోయ్ లేచిపొమ్మంటోందేంటీ?' అనుకుంటూ గదిలోకి వెళ్ళబోయిన అతను తర్వాత వినిపించిన మాటలకి ఉలిక్కిపడ్డాడు.

"అమ్మలు విషం సీసాలతో, నాన్నలు ఉరితాళ్ళతో ఇంకా ఎంతకాలం బెదిరిస్తారు? నువ్వు మెత్తబడ్డావంటే నాలాగే నీ జీవితం కూడా నాశనమైపోతుంది" సాగరి కోపంగా చెప్పింది.

"....."

"మీ అమ్మ చెప్పలేదా? అవున్లే. చెపితే నేను మీకు మార్గదర్శినౌతానని అనుకుని ఉంటుంది. మా అమ్మా నాన్న కూడా నన్ను ఇలాగే బెదిరించారు. మీ అమ్మ, అమ్మమ్మా కూడా ఉన్నారు వంతపాడుతూ."

"...."

"నా క్లాస్ మేట్ కృపాకర్. కృప నేను రిజిస్టర్ మేరేజ్ చేసుకుందామని అప్లై చేసాం. ముప్పైరోజులు ఆగాలి. ఇంట్లోంచి వెళ్ళిపోయి పదకొండు రోజులు కలిసి కాపురం చేసాం. పన్నెండోరోజు మానాన్న, మీ నాన్న ఎలా కనుక్కున్నారో కానీ మా రూముకి వచ్చారు. కృపని కొట్టి నన్ను ఇంటికి లాక్కెళ్ళారు. కృప... నా కృప.. నాకోసం ఎన్ని దెబ్బలు తిన్నాడో" ఆ సంఘటన అప్పుడే జరిగినట్లుగా సాగరి వెక్కి వెక్కి ఏడుస్తోంది.

విభు నిర్ఘాంతపోయాడు. సోఫాలో కూలబడిపోయి కళ్ళమీద చేతులుంచుకున్నాడు.

"...."

"లేదు. తర్వాత తనని చూడలేదు. ఏమయ్యాడో? బతికున్నాడో, వీళ్ళు చంపేసారో లేక నేను లేని జీవితం వద్దని ఆత్మహత్య చేసుకున్నాడో ఏమీ తెలీదు. నాన్న వేరే ఊరికి మకాం మార్చాడు. నెలరోజుల్లో విభుతో పెళ్ళి కుదిర్చారు. ఇప్పుడు నిన్ను చేస్తున్నట్లే నన్నూ ఎమోషనల్ బ్లాక్‌మెయిల్ చేసి ఈ పెళ్ళి చేసారు. దేవుడు నాకేదైనా వరమిస్తానంటే, ఆ పదకొండు రోజులు తిరిగివ్వమని కోరుకుంటా. ఆ చిన్నగదిలో కిరసనాయిల్ స్టవ్ మీద వండుకు తింటూ, నేలమీద పడుకుంటూ... స్వర్గం అంటే అదే..."

విభు నిశ్శబ్దంగా బయటకి నడిచాడు. అతనికి ఎక్కడికి వెళ్ళాలో తెలీలేదు. సెల్లార్‌లోని తన కారు తలుపు తీసి డ్రైవింగ్ సీట్లో కూర్చున్నాడు. సాగరి ఒద్దికగల ఇల్లాలు కాదు. గత్యంతరం లేక ఉంటున్న ఇల్లాలు. తమ మొదటి రాత్రి తనకి మాత్రమే మొదటి రాత్రి. ఆమెకి ఆ అనుభవం అంతకు ముందే ఉంది. అకస్మాత్తుగా అతన్ని దుఃఖం కమ్మేసింది.

విభు స్టీరింగ్ వీల్ మీద తలపెట్టి దాదాపు పదినిమిషాలు రోదిస్తూనే ఉన్నాడు. తెప్పరిల్లాక పేపర్ నేప్కిన్‌తో కళ్ళూ, ముక్కూ తుడుచుకుని వెనక్కి వాలి కూర్చున్నాడు. ఇప్పుడు తనేం చేయాలి? మోసంచేసినందుకు అత్తామామల మీదకి యుద్ధానికి వెళ్ళాలా? తన తల్లితండ్రులకి చెప్పి సలహా అడగాలా? లేక సాగరికి విడాకులివ్వాలా? మరి పిల్లలు?

ఆ ఆలోచన రాగానే విభూ నిటారుగా కూర్చున్నాడు. పదిహేడేళ్ళ పాపకి, పదిహేనేళ్ళ బాబుకి ఈ వయసులో అమ్మా నాన్న ఇద్దరూ ముఖ్యమే. ఎవరో ఒకరి దగ్గరే ఉండాలి అంటే వాళ్ళకి ఎంత ప్రెజర్ ఉంటుంది? వాళ్ళ ఫ్రెండ్స్ ముందు అవమానం కదూ? తనకి మాత్రం?

ఉదయం వాక్‌లో కలిసిన గణేష్ మాటలు గుర్తొచ్చాయి.

"మీ పిల్లలు ఎంత బుద్ధిమంతులు విభూ? పాప ఎంతో పద్ధతిగా ఉంటుంది. ఈ కాలం పిల్లల్లో అలాంటివాళ్ళు చాలా తక్కువ. టెంత్ లో మీ వాడికి స్టేట్ రేంక్ ఖాయం అని టీచర్స్ అంటున్నారట. ఎప్పుడూ ఫోన్ లోనే ఉంటుంది. ఎంతైనా సిస్టర్ అమేజింగ్. టి.వి కూడా చూడదట. మా ఇంట్లో చెప్పారు ట్యూషన్స్ లేకుండా పిల్లల్ని శ్రద్ధగా

చదివిస్తుందిట. మా ఆవిడ కూడా జాబ్ లేకుండా ఇంట్లోనే ఉంటూంది. ఎప్పుడూ ఫోన్ లోనే ఉంటుంది. మా పిల్లల్ని ఫస్ట్ క్లాస్ నించి ట్యూషన్స్‌కి పంపుతోంది. 'నువ్వు చెప్పచ్చుగా?' అంటే నాకు టైం లేదు అంటుంది."

నిజమే. సాగరి సిస్టమాటిక్‌గా ఉంటుంది. ఆఫీస్ నించి ఇంటికి వచ్చాక ఇంటి వాతావరణం తనకి ఎంతో ఆహ్లాదంగా ఉంటుంది. అన్నీ టైం ప్రకారం జరిగిపోతాయి. అలా అని పిల్లలతో కఠినంగా ఉండదు. ప్రేమగా కబుర్లు చెప్తూంటుంది. తనతోనే మాటలు తక్కువ.

మళ్ళీ అతనికి దుఃఖం వచ్చింది. సాగరి మనసులో తను లేదు. ఇంకా కృపాకరే ఉన్నాడు. అందుకే తనతో ఎక్కువ మాట్లాడదు.

ఆఫీస్‌నించి ముందుగా ఇంటికి వచ్చినందుకు తనని తాను తిట్టుకున్నాడు. తనేం చేయాలి? శీలం లేని భార్యతో మళ్ళీ తాను మామూలుగా ఉండగలడా? అసలు శీలం అంటే ఏమిటి? 'శీలం అంటే సత్‌ప్రవర్తన ' అని తెలుగు మాస్టారు చెప్పింది గుర్తొచ్చింది. తన వదిన శీలవతి కావచ్చు కాని పరమ గయ్యాళి. ఆమెతో అన్నయ్య ఎంత బాధపడుతున్నాడో. 'మమ్మల్ని పూచికపుల్లలకంటే హీనంగా తీసిపారేస్తుందిరా ' అని తల్లి ఎన్నోసార్లు బాధపడింది. సాగరి తనకిచ్చే విలువకి మురిసిపోయి అందరికీ చెప్పుకుంటుంది. 'నా చిన్న కోడలు బంగారం' అని. మరి తన వదిన శీలం లేని సాగరికన్నా ఉత్తమురాలా?

పగలు కూడా నైటీల్లో తిరుగుతూ, ఎప్పుడూ ఫోన్ లో మాట్లాడుతూ , పిల్లలని , ఇంటిని పట్టించుకోని భార్యతో గణేష్ అడ్జస్ట్ అవుతున్నాడు కదా ? మరి సాగరి కంటే ఆమె గొప్పతనం ఏమిటి ? శీలమేనా ?

తన పెళ్ళయిన ఈ పద్దెనిమిదేళ్ళ కాలంలో తమమధ్య ఒక్క గొడవకూడా రాలేదు ఆ మాట చెపితే ఫ్రెండ్స్ 'అతిశయోక్తి' అని నవ్వేస్తారు కాని అది నిజం. సాగరి ఏ విషయంలోనూ ఆర్గ్యూ చేయదు. వాదనలు లేనప్పుడు గొడవలు ఏముంటాయి?

అతనికి సాగరి మీద సానుభూతి కలిగింది. ప్రేమించిన అతన్ని మర్చిపోలేకపోతోంది. ఇష్టం లేనివాడిని పెళ్ళిచేసుకుని వాడితో అయిష్టంగా కాపురం చేస్తోంది. అలా అని ఆ ఫ్రస్టేషన్ అసలు బయటకి చూపించదు. చిరునవ్వు తప్ప సాగరి పెద్దగా నవ్వడం తాను ఎప్పుడూ చూడలేదు. స్వభావం అనుకున్నాడు. పాపం ఎంత నరకం.

ఇప్పుడు తనముందు రెండు ఆప్షన్స్ ఉన్నాయి.

సాగరికి విడాకులిచ్చి, పిల్లల్ని ఆమె కస్టడీలో ఉంచి తన జీతం మూడొంతులు ఇవ్వడం, లేదా ఆ ఫోన్ కాల్ విననట్లుగా ఎప్పటిలా ఉండడం.

విభు ఓ క్షణం ఆలోచించి, కారుదిగి దాన్ని లాక్ చేసి లిఫ్ట్ వైపు నడిచాడు. తలుపు తీసుకుని ఇంట్లోకి వస్తున్న అతనికి వంటింట్లో ఉల్లిపాయలు వేగే వాసన వస్తోంది.

"సాగరీ వంట చేయకు. పిల్లలు వచ్చాక డిన్నర్‌కి వెళ్దాం" పెద్దగా చెప్పాడు.

మంచినీళ్ళ  గ్లాసుతో బయటకి వచ్చిన సాగరి తనదైన చిరునవ్వుతో చెప్పింది "అలాగే. స్టవ్ ఆపేస్తాను."

*(వచ్చే సంచికలో మరో సరిగమ)*

Click here to share your comments